నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్‌ తెలిపారు. 11కేవీ గుండ్లపోచంపల్లి, దూలపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుండ్లపోచంపల్లి, ఇంటిగ్రిటీ హోమ్స్‌, దూలపల్లి రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఆర్‌ఎస్‌ స్కూల్‌ ఏరియాలో విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

స్పాట్‌ అసెస్‌మెంట్‌ ప్రిలిమ్స్‌లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్‌ యాజమాన్యం

కీసర: విక్రమ్‌ సారాభాయ్‌ సైన్స్‌ ఫౌండేషన్‌ (వీఎస్‌ఎస్‌ఎఫ్‌) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన స్పాట్‌ అసెస్‌మెంట్‌ ఆన్‌లైన్‌ ప్రిలిమ్స్‌ పరీక్షల్లో రాంపల్లి జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థి జోయెల్‌ లక్రా నాల్గోస్థానం సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచాడు. ఈ సందర్భంగా స్కూల్‌ ప్రెసిడెంట్‌ మురళీముకుంద్‌ గురువారం జోయెల్‌ లక్రాను అభినందించాడు. ప్రిన్సిపల్‌ సంతోష్‌కుమార్‌, హెచ్‌ఎం.సుశీల, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఓ మొక్క నాటాలి


మొక్క నాటుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నేతలు

ఘట్‌కేసర్‌: వికసిత్‌ భారత్‌లో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలో బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అమ్మ పేరుతో ఓ మొక్కను నాటండి' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందజేస్తుందని పేర్కొన్నారు. బీజేపీ మున్సిపల్‌ మాజీ అధ్యక్షుడు హనుమాన్‌, మహేందర్‌, వీరేశం, శ్రీధర్‌, రాధిక, మధు, విక్రాంత్‌రెడ్డి, అనిల్‌గౌడ్‌, శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి, సురేంద్ర, ఆంజనేయులు, కిరణ్‌, మాధవి, అనిత, మమతాశర్మ, పుష్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


కీసర ఎంఈవోతో ఉపాధ్యాయ ఫెడరేషన్‌ సభ్యులు

కీసర: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (టీయూటీఎఫ్‌) కీసర మండలశాఖ అధ్యక్షులు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, జిల్లా అధ్యక్షులు పంబళ్ల రాజుల ఆధ్వర్యంలో గురువారం కీసర మండల ఎంఈఓ జమదగ్నిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించిన అనంతరం టీయూటీఎఫ్‌ డైరీని అందజేశారు. రామినేని వెంకటేశ్వర్లు, నర్సింగ్‌రావు, మోహన్‌బాబు, ఆనంద్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.37.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు


పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

మేడ్చల్‌: మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు అర్చన కాలనీలో రూ.37.50 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్‌ అధికారులు కాంగ్రెస్‌ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ పనులను సీఅండ్‌బీజీఆర్‌ఎస్‌ నిధులతో నిర్మాణం చేపట్టినట్లు అధికారులు వివరించారు. నవీన్‌రెడ్డి, స్థానిక నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, రమేష్‌, సుధాకర్‌, కమలాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పూర్తయ్యేదెప్పుడో?

- వర్షాలు కురిస్తే మట్టి వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం
- త్వరగా పూర్తిచేయాలని కోరుతున్న ప్రజలు



దమ్మాయిగూడలోని నాలాల్లో కొనసాగుతున్న పనులు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వర్షాకాలంలో వరదనీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు నాలాల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్న సందర్భంగా రెండు మున్సిపాలిటీల్లో అధికారులు నాలాలను శుభ్రం చేసే పనుల్లో వేగం పెంచి వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.25 లక్షల బడ్జెట్‌..

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నర్సింహ్మచెరువు నుంచి కోవుల కుంట, భవానీనగర్‌కాలనీ గుండా కుమ్మరికుంట వరకు, చీర్యాల పెద్ద చెరువు నుంచి లీడ్‌ ఇండియా భారతరత్న స్కూల్‌ నుంచి అహ్మద్‌గూడ ప్రధాన రహదారి మీదుగా కుందన్‌పల్లి వాగు వరకు, చీర్యాల వట్టాగు నాలా, కీసరలో భోగారం రహదారిలోని మురుగునీటి కాల్వను శుభ్రం చేసేందుకు మున్సిపల్‌ నుంచి సుమారు రూ.25 లక్షల బడ్జెట్‌ను కేటాయించారు.

50 శాతం కూడా పూర్తికాని పనులు

చీర్యాల పెద్ద చెరువు నుంచి అహ్మద్‌గూడ ప్రధాన రహదారి వరకు గల నాలా క్లీనింగ్‌ పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం మేర కుడా పనులు పూర్తి కాలేదు. చీర్యాల వట్టాగు, కీసర తదితర ప్రాంతాల్లో నాలా, మురికికాల్వల క్లీనింగ్‌, పనులు ఇప్పటివరకు మొదలుకాలేదు. వర్షాలు పెద్దఎత్తున కురిస్తే నాలాలకు చేరువలో ఉన్న కాలనీవాసులకు వరదముప్పు పొంచి ఉందని, పనులు ప్రారంభమైన చోట త్వరగా పూర్తి చేయడంతో పాటు, పనులు మొదలు పెట్టని చోట త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

పేరుకుపోయిన మట్టి వ్యర్థాలు..

నాలాల్లో తొలగించిన పూడిక మట్టి, చెత్తాచెదారాన్ని దూరంగా తరలించాల్సిన అవసరం ఉంది. లేదంటే వర్షాలు కురిసి వరద ప్రవాహం వస్తే పూడికమట్టి తిరిగి నాలాల్లోనే చేరే ప్రమాదం ఉంటుంది. ఇక నాగారం మున్సిపల్‌ పరిధిలో అన్నరాయిని చెరువు నాలా, రాంపల్లి పాత చెరువు నుంచి చర్లపల్లి రహదారి వరకు గల నాలా, ఎర్రమల్లెవాగు నాలాను శుభ్రం చేసే పనుల నిమిత్తం రూ. 15 లక్షల మేర మున్సిపల్‌ నిధులు వెచ్చించారు.

◆ మూడు నాలాల్లో చెత్త,చెదారం, పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. 50శాతం నుంచి 60 శాతం మేర మాత్రమే పనులు పూర్తయ్యాయని, 100 శాతం పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్‌ పరిధిలోని ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి..

రెండు మున్సిపాలిటీల్లో వర్షాకాలం నేపథ్యంలో చేపట్టిన నాలా క్లీనింగ్‌ పనులను త్వరగా పూర్తిచేయాలి. వర్షాలు కురుస్తున్నందునా.. పెండింగ్‌ పనులు పూర్తిచేయడంతో పాటు, పనులు ప్రారంభం కాని చోట్ల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌, నాగారం మున్సిపాలిటీ

60 శాతం పనులు పూర్తి చేశాం



వర్షాకాలంలో వరదనీటి సమస్యలను పరిష్కరించేందుకు నాగారం మున్సిపాలిటీలో చేపట్టిన నాలాల్లో పూడికతీత పనులను త్వరగా పూర్తి చేసేలా తగిన చర్యలు చేపడతాం. ఇప్పటికే 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశిస్తాం.

– భాస్కర్‌రెడ్డి, నాగారం మున్సిపల్‌ కమిషనర్‌

రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి


కలెక్టర్‌ మనుచౌదరికి వినతిపత్రం ఇస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

మేడ్చల్‌: మేడ్చల్‌ జిల్లా అర్బన్‌జిల్లాగా ఉండటం, ఔటర్‌రింగురోడ్డుకు దగ్గరగా ఉండటంతో చాలామందికి రైతుభరోసా రాలేదని డబీల్‌పూర్‌ పీఏసీఎస్‌ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌ పీఏసీఎస్‌ అధ్యక్షుడు రందీప్‌రెడ్డి, శామీర్‌పేట్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, పూడూర్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డిలు మీడియా సమావేశంలో గురువారం మాట్లాడుతూ.. మేడ్చల్‌ జిల్లాలో 49వేల మంది రైతులు ఉంటే ప్రభుత్వం కేవలం 4వేల మంది రైతులకు మాత్రమే రైతుభరోసా వారి అకౌంట్లలోకి వచ్చిందన్నారు. మిగిలిన రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు విడతలుగా మేడ్చల్‌ రైతులకు ప్రభుత్వం రైతుభరోసా నిధులు ఇవ్వలేదన్నారు. మేడ్చల్‌ జిల్లాలో వ్యవసాయం చేస్తున్న రైతులు రైతులు కాదా.. అని ప్రశ్నించారు. మేడ్చల్‌ రైతుల పొలాలకు ధరలు అధికంగా ఉంటే, ఔటర్‌రింగు రోడ్డుకు సమీపంలో ఉంటే వాటిని అమ్ముకోలేక, కుటుంబపోషణ కోసం అరుగాలం కష్టపడి సాగుచేస్తుంటే ప్రభుత్వం కుంటిసాకులు చూపి రైతు భరోసా ఇవ్వకపోవడం మేడ్చల్‌ రైతులపై కక్షసాధింపు చేయడమేనని ధ్వజమెత్తారు. వెంటనే ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత...

జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల చేయాలని వివిధ ప్రాంతాల రైతులతో కలిసి రైతు నాయకులు గురువారం జిల్లా కలెక్టర్‌ మనుచౌదరిని కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రైతులందరికీ రైతుభరోసా నిధులు ఎందుకు ఇవ్వడం లేదనే విషయాన్ని ప్రభుత్వంతో మాట్లాడి నిధులు రైతుల ఖాతాలలో జమ చేయాలని కోరారు. రైతు సహకార సంఘాల చైర్మన్లు, రైతు నాయకులు పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళకు రైతులు వినతిపత్రం అందజేశారు.

రైతు భరోసా వర్తింపజేయాలి..

కీసర: వ్యవసాయ రైతులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా పథకాన్ని కీసర మండల రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్‌ చేస్తూ.. గురువారం కీసర అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కీసర రైతు సహకార సొసైటీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ రైతుభరోసా కింద ఆర్థికసాయం అందజేస్తున్న విధంగా కీసర మండల రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేసి రైతులకు ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్‌ చేశారు. కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షులు రాముని ప్రభాకర్‌రెడ్డి, రైతులు సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆగమయ్య, బలవంతరెడ్డి, కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం శివ, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌: మేడ్చల్‌ జిల్లాలోని రైతులకు రైతుభరోసా నిధులు మంజూరు చేయాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ మిక్కిలినేని మనూ చౌదరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీఎంస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేస్తున్నారని, మేడ్చల్‌ జిల్లాలోని ఏ ఒక్క రైతు అకౌంట్‌లలో రైతు భరోసా నిధులను జమ చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సగం రైతుల రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమచేయకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రందీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


కీసరలో ధర్నా చేస్తున్న రైతులు

పీహెచ్‌సీలో 'స్టాప్‌ డయేరియా' ప్రారంభం

పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్టాప్‌ డయేరియా' కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సి.ఉమాగౌరీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డయేరియా నివారణకు వివిధ చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో అంతర్‌ శాఖల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్‌ సమావేశం నిర్వహించి, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్‌, జింక్‌ మాత్రల సరఫరా అంచనావేసి, అవసరమైన చోట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని శాఖలు సమన్వయం, కమ్యూనిటీ, విద్యా సంస్థల భాగస్వామ్యంతో డయేరియా వంటి వ్యాధులపై పూర్తి నియంత్రణ సాధించగలమని చెప్పారు. కీసర డివిజన్‌ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సత్యవతి, జిల్లా టీకాల అధికారి, క్యాంపెయిన్‌ నోడల్‌ అధికారి డా.కౌశిక్‌, నారపల్లి పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ డా.శోభన, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరి

యోగా డేను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌: 21న నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో మేడ్చల్‌ మున్సిపల్‌ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్‌ బీజేపీ అధ్యక్షురాలు శైలజహరినాథ్‌ కోరారు. మేడ్చల్‌లో ఆమె పట్టణ బీజేపీ నేతలతో కలిసి మాట్లాడుతూ.. మేడ్చల్‌లో 21న యోగా దినోత్సవాన్ని కేఎల్‌ఆర్‌ వెంచర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల ప్రజలు పార్టీలకు అతీతంగా హాజరై ఆరోగ్య రక్షణకు యోగాసానాలు వేయాలని కోరారు. బీజేపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్‌, శ్రీకాంత్‌ వంశీవిజయ్‌, వంశీధర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ పర్యటన

కీసర: వంద రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో సీడీఎంఏ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ జ్యోష్న, మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డిలు 3వ వార్డులోని పార్కులో బ్లాక్‌ ప్లాంటేషన్‌ మొక్కలు నాటారు. కంపోస్ట్‌ తయారీ కేంద్రాన్ని సందర్శించి అందులో నుంచి వేస్ట్‌ వాటర్‌ పోవడానికి కాలువలాగా చేయాలని అధికారుల సూచించారు. వీధి కుక్కల నియంత్రణ ఏబీసీ కన్నెల్‌ సందర్శించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ చేయాలన్నారు. అనంతరం నాగారం మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి, వారు తయారుచేస్తున్న వస్తువులపైన సంఘాల పేర్లు అడ్రస్సులు, ఫోన్‌ నెంబర్లు పెట్టాలని సూచించారు. మురికికాలువలో రీసెల్టింగ్‌ వాటర్‌ను సందర్శించి రేలింగ్‌, మెస్‌ ఫెన్సింగ్‌ చేయాలని చెప్పారు.


మొక్కలు నాటుతున్న సీడీఎంఏ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ జ్యోష్న, కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి

రైల్వే వంతెన బాధితులకు పరిహారంపై సమీక్ష

ఘట్‌కేసర్‌: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన బాధితులతో ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు, కోర్టుకు వెళ్లిన 11 మంది బాధితులతో నష్టపరిహారంపై చర్చించారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించడం, కోర్టుకు వెళ్లిన వారికి న్యాయం చేయాలని ఆర్డీఓను స్థానికులు కోరారు. పదేళ్లుగా సాగుతున్న వంతెన పనులతో ఎదురౌతున్న సమస్యలను వివరించారు. మున్సిపల్‌ కమిషనర్‌ చంద్రశేఖర్‌, జెడ్పీ మాజీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌, బీ బ్లాక్‌ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌, మున్సిపల్‌ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్‌, మాజీ సర్పంచ్‌ యాదగిరి యాదవ్‌, జంగయ్యయాదవ్‌, మాజీ కౌన్సిలర్‌ మల్లేష్‌, దేవేందర్‌ముదిరాజ్‌, ఆంజనేయులు యాదవ్‌, నాగరాజుముదిరాజ్‌, సంజీవరెడ్డి, సత్తిరెడ్డి, సురేష్‌ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యం

బోడుప్పల్‌: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ అన్నారు. గురువారం బోడుప్పల్‌ జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో గురువారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులతో కంపోస్టు ఫిట్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. స్కూల్‌లో చెట్ల నుంచి రాలిన ఆకులను ఊడ్చి వాటి ద్వారా ఎరువును తయారు చేసే ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. వీటి ద్వారా వచ్చే ఎరువును మొక్కలకు వేయనున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులు కూడా ఈ ప్రక్రియను చేపట్టి ఎరువును తయారు చేసుకోవచ్చని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నారాయణరెడ్డి, హెల్త్‌ అసిస్టెంట్‌ వినోద్‌, వార్డు ఆఫీసర్లు శివ, అరుణ్‌, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ పంపిణీ



పోచారం: చౌదరిగూడలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఘట్‌కేసర్‌ మండల యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌ ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్స్‌, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు, మేడ్చల్‌ మల్కాజిగిరి ఇన్‌చార్జి ఎలిమినేటి సురేష్‌ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూల్‌కు హాజరవుతూ.. బాగా చదువుకోవాలన్నారు. యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు బొమ్మక్‌ అజయ్‌, ప్రధాన కార్యదర్శి క్రాంతిగౌడ్‌, టీపీసీసీ లీగల్‌సెల్‌ జాయింట్‌ కన్వీనర్‌ పాలడుగుల అమరేందర్‌రెడ్డి, మండల మాజీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలోని చీర్యాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ రాధికగుప్తా అధికారులతో కలిసి పరిశీలించారు. గురువారం అహ్మద్‌గూడలోని ప్రభుత్వ పాఠశాల, వీకర్‌ సెక్షన్‌ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్‌లో తనిఖీ నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణి, డీఈ బాలమురళీ, డీఈఈ భగవంత్‌రావు, చీర్యాల గ్రామకార్యదర్శి నారాయణగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికగుప్తా అన్నారు. ఘనాపూర్‌, ఏదులాబాద్‌ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను మున్సిపల్‌ కమిషనర్‌ చంద్రశేఖర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో తేడా రావొద్దని, గడువులోగా నిర్మించుకోవాలని సూచించారు. మున్సిపల్‌ ఆర్‌ఓ కవిత, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మారుతి, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ రాధికగుప్తా

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా !

- ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల్లో దర్జాగా వెలుస్తున్న వెంచర్లు
- గ్రామకంఠం భూములపై కన్ను
- కన్నెత్తి చూడని రెవెన్యూ యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 11,384 ఎకరాల అసైన్డ్‌ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటికి ఎలాంటి రక్షణ లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. ఇప్పటికే సగం మేర భూములు రియల్టర్లు, భూ ఆక్రమణదారుల చేతుల్లో వెంచర్లు, విల్లాలు, ఇండిపెండెంట్‌ ఇళ్లు, పలు ప్రైవేట్‌ సంస్థలుగా మారడంతో వాటిని స్వాధీనం చేసుకోవడం రెవెన్యూశాఖకు కష్టతరమవుతోంది. ఉన్న కొద్ది భూములకైనా ఫెన్సింగ్‌, బోర్డులు లేకపోవడంతో కన్నేసిన కబ్జాదారులు నకిలీపత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. భూ ఆక్రమణలపై ఇటీవల హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో కబ్జాల పర్వం వెలుగులోకి వస్తున్నాయి.

భూ కబ్జాలు ఇలా...

ఘట్‌కేసర్‌ మండలం కొర్రెముల్‌లోని సర్వే నెం.739 నుంచి 749 వరకు 147 ఎకరాల్లో ఏకశిలానగర్‌ పేరుతో లే అవుట్‌ను 1985లో చేశారు. అందులోని 47 ఎకరాలను 2006లో వ్యవసాయ భూమిగా మార్చేసిన ఓ వ్యక్తి లే అవుట్‌ స్వరూపాన్నే మార్చారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

◆ కొర్రెముల్‌లోని సర్వే నెం.796లో 11.20 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 7.20 ఎకరాల పరిధిలో ఓ మెడికల్‌ కాలేజీని ఏర్పాటు చేశారు. మిగతా 4 ఎకరాలు కబ్జా చేసి దీంతో పాటు నాడెం చెరువు ఎఫ్‌టీఎల్‌ పరిధిలో ఈ నిర్మాణాలు చేపడుతున్నారని హైడ్రాకు ఫిర్యాదులు అందాయి.

◆ అల్వాల్‌ మండలం జొన్న బండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, దీంతో 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ అన్నోజిగూడలోని సర్వే నెంబర్లు 9,10లోని పదెకరాల లే అవుట్‌లో ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కును ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నోజిగూడలోని సర్వే నెంబర్‌ 14లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి విక్రయించగా.. రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి.

◆ ముత్వెల్లిగూడలో ప్రధాన రోడ్డు స్థలాన్ని 9 అడుగులు ఆక్రమించి సెల్లార్‌ పాటు భవన నిర్మాణం జరుగుతోందని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. అదే ప్రాంతంలో మరో 4 భవనాలు తూర్పు వైపున 10 అడుగుల వరకు ఉన్న రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు మొత్తుకున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.

◆ కాప్రా సర్కిల్‌ పరిధిలోని సర్వేనంబర్‌199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షలకు విక్రయిస్తున్నారు. మల్లాపూర్‌ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వేనంబర్‌ 24లోని రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నా.. పట్టింపేలేదు.

◆ కీసరలోని సర్వే నంబర్‌ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా.. ఓ భూ కబ్జాదారుడు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, రెండెకరాల స్థలంలో బండరాళ్లను తొలగించి భవన నిర్మాణం ప్రారంభించినా.. ఫారెస్టు, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

◆ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్‌ 825లో ఉన్న 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్‌ వ్యక్తుల కబ్జాలో ఉండగా.. ఇక్కడే 181 సర్వేనంబరులోని రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జాచేసి నిర్మాణాలు చేపడున్నా.. రెవెన్యూ శాఖలో కదలికలేదు.

◆ బోడుప్పల్‌ పరిధిలోని సర్వేనంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. బోడుప్పల్‌ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఓ భూ కబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లే అవుట్‌ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించారు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని భూ కబ్జాదారులు, స్థానిక నాయకులు 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా.. కొత్త లే అవుట్‌ తయారు చేసి, ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.

◆ పీర్జాదిగూడలోని 13 కాలనీల్లోని మూడెకరాల పార్కుల స్థలాలు కూడా కబ్జాదారుల గుప్పిట్లో ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోడుప్పల్‌ పరిధిలోని చెంగిచర్ల, చింతలకుంట చెరువుకట్ట సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. యప్రాల్‌లో సర్వేనంబర్‌ 171లోని బండాయికుంటను ఆక్రమించి, ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం.

◆ శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కన ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా.. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. మారేడుపల్లి సర్వేనంబర్‌ 56, 57, 58లలోని 1.9 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.